క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: పట్టణంలోని 11 కేవీ రాంనగర్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలలో విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణుగోపాలచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్ల విస్తరణ, 11కేవీ లైన్ షిఫ్ట పనులు జరుగుతున్న ప్రాంతాలైన మిర్యాలగూడ రోడ్, శామ్సనగర్, భారత్ గ్యాస్ ఏరియా, దారుపాష కాలనీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అబ్దుల్ కలాంకు నివాళి

నల్లగొండ టూటౌన్: అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా కోణం ఫౌండేషన్ ×క్రియా× కార్యక్రమంలో భాగంగా బుధవారం నల్లగొండలోని రామగిరి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, పద్మనగర్ ఎంకేవీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రపంచ విద్యార్థుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోణం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన యాప్ ద్వారా విద్యార్థులతో మెదడుకు పదును పెట్టే పలు అభ్యసన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు రఘుపాల్ రెడ్డి, ఉషా, ఉపాధ్యాయులు సుజాత, సఫియా, కోణం ఫౌండేషన్ ప్రతినిధులు శ్వేత, శ్రీవాణి పాల్గొన్నారు.

18న బీసీ సంఘాల బంద్

చిట్యాల: బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18వ తేదీన బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కునూరు సంజయ్‌దాస్‌గౌడ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చేకూరి గణేశ్ బుధవారం వేర్వేరుగా ప్రకటనలో కోరారు. బంద్‌లో బీసీలంతా ఐక్యంగా పాల్గొనాలని కోరారు.

జిల్లా కార్యవర్గ సభ్యుడిగా సతీష్

చిట్యాల: పట్టణానికి చెందిన కంబపాటి సతీష్ తెలంగాణ కుమ్మర సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈమేరకు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏడుకొండల వెంకటేశ్వర్లు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్‌కు శిక్షణ



సర్టిఫికెట్లతో ఎలక్ట్రికల్ వర్కర్లు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లా ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్‌కు జీడి గోయెంక యూనివర్సిటీ ఎలక్ట్రికల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో హావెల్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సహకారంతో బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా హావెల్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ రీజనల్ సేల్స్ మేనేజర్ కామేష్ నరసింహారావు మాట్లాడేతూ మార్కెట్‌కు అనుగుణంగా ఎలక్ట్రికల్స్ వర్క్‌లో వస్తున్న నూతన మార్పులను నేర్చుకోవాలన్నారు. శిక్షణ అనంతరం వర్కర్స్‌కు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో హావెల్స్ ఏరియా ఇన్‌చార్జ్ జి.దేవి వరుణ్, నిర్వాహకులు రొట్టెల సందీప్‌గౌడ్, గాలి శివకుమార్, వనపర్తి నరేష్, ట్రైనర్ నీలకంఠం శివశంకర్ నల్లగొండ ఎలక్ట్రికల్ యూనియన్ సభ్యులు నాగయ్య, గోలి శ్రీను, వరికుప్పల హనుమంతు పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుల్‌కు గాయాలు

నల్లగొండ: పట్టణంలోని మర్రిగూడ బైపాస్ వద్ద బుధవారం మధ్యాహ్నం విధులు నిర్వహించేందుకు తన స్కూటీపై వెళ్తున్న కానిస్టేబల్ సిరిని వెనుక నుంచి వస్తున్న వాహనదారుడు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆమె ముఖానికి గాయమైంది. సమాచారం అందుకున్న ట్రాఫిక్ ఎస్ఐ విజయబాయి అక్కడికి చేరుకుని మహిళా కానిస్టేబుల్‌ను జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించి తన సొంత డబ్బులతో వైద్య చికిత్స చేయించారు.

పూర్వ విద్యార్థికి సన్మానం



యశ్వంత్‌రెడ్డిని సన్మానిస్తున్న కోడి శ్రీనివాసులు

చండూరు : ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో ఎంబీబీఎస్ సీటు సాధించిన ఏనుగు యశ్వంత్ రెడ్డిని బుధవారం చండూరు పట్టణంలో గాంధీజీ పాఠశాల చైర్మన్ కోడి శ్రీనివాసులు, డైరెక్టర్లు సన్మానించారు. అనంతరం కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ తమ పాఠశాల పూర్వ విద్యార్థి వనపర్తి మెడికల్ కాలేజీలో సీటు సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ భార్గవ్, రాధిక, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తండాలకు కనీస సౌకర్యాలు కరువు

- పూర్తిస్థాయిలో లేని సీసీ రోడ్లు, డ్రెయినేజీలు
- రేషన్ సరుకులకు, ఓటు వేయడానికి పక్క గ్రామాలకు వెళ్లాల్సిందే
- ఉపాధి కరువై వలసలు పోతున్న గిరిజనులు



అధ్వానంగా ఉన్న అజనాతండా నుంచి నామాపురం గ్రామానికి వెళ్లే దారి



అంతంపేట గ్రామం నుంచి రంగంతండాకు కంకర పోసి వదిలేసిన రోడ్డు

గట్టుప్పల్ : కనీస సౌకర్యాలు లేక తండాల వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తండాలోకి వెళ్లేందుకు కనీసం రోడ్డు సౌకర్యం కూడా లేదు. ఉపాధి కరువై గిరిజనులు పట్టణాల బాట పడుతున్నారు. గట్టుప్పల్ మండల పరిధిలో రంగంతండా, అజనాతండా, దేవులతండా, రాగ్యాతండాలు ఉన్నాయి. ఈ నాలుగు తండాలు గతంలో మర్రిగూడ మండలం నుంచి నూతన మండలం గట్టుప్పల్ పరిధిలోకి చేరాయి. కొత్త మండలం ఏర్పాటు జరిగి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఆ తండాల్లో కనీస అభివృద్ధి జరుగలేదు. సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా ఉన్నాయి. ఆ ప్రాంతంలో ఉపాధి లేక గిరిజన యువకులు, మహిళలు హైదరాబాద్‌కు వలసలు పోతున్నారు. తండాల్లో వృద్ధులు మినహా యువకులు కనిపించరు. రేషన్, నిత్యావసర సరుకులు తెచ్చుకునేందుకు తండావాసులు రెండు నుంచి మూడు కిలోమీటర్ల దూరం వెళ్లి తెచ్చుకోవాల్సిందే. అంగన్‌వాడీ కేంద్రం మినహా ప్రభుత్వ పాఠశాల లేదు. సీసీ రోడ్లు, మురికి కాలువలు పూర్తిస్థాయిలో లేవు.

రోడ్డు సౌకర్యం లేకపోవడంతో..

అంతంపేట గ్రామం నుంచి రంగంతండా మీదుగా అజనాతండాకు 2023 సంవత్సరంలో రూ.1.75 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. కంకర పరిచి సంబంధిత కాంట్రాక్టర్ వదిలేయడంతో గిరిజనులు రోడ్డు వెంట నడిచి వెళ్లడానికి నరకయాతన పడుతున్నారు. అజనాతండా నుంచి నామాపురం గ్రామానికి వెళ్లడానికి గుంతల రోడ్డుతో గిరిజనులకు ఇబ్బందులు తప్పడం లేదు. అంతంపేట నుంచి నామాపురంకు రోడ్డు సౌకర్యం లేక చుట్టూ తిరిగి గ్రామానికి వెళ్తున్నారు. దేవులతండా, రాజ్యతండా వాసులకు చిన్న వర్షం పడినా తండాలకు చేరుకునేందుకు అవస్థలు తప్పడం లేదు.

ఓటుకు.. రేషన్‌కు..

నాలుగు తండాలకు చెందిన గిరిజనులు ఓటు వేయడానికి, రేషన్ సరుకులు తెచ్చుకోవడానికి కిలో మీటర్ల మేర దూరం వెళ్లాల్సిందే. ప్రతి నెల రేషన్ సరుకులు తెచ్చుకోవడానికి అజనాతండా వాసులు 3.5 కిలో మీటర్లు, రంగంతండా గిరిజనులు 2.5 కిలో మీటర్లు, దేవులతండా, రాగ్యాతండా వాసులు 2 కిలోమీటర్ల వరకు వెళ్లి తెచ్చుకోవాల్సిందే. ఇక ఓటు వేయడానికి అంతంపేట గ్రామానికి వెళ్లాల్సి వస్తోంది.

జనాభా ఇలా..

రంగంతండాలో ఓటర్ల సంఖ్య సుమారు 256, జనాభా 376 ఉన్నారు. అజనాతండాలో ఓటర్లు 75, జనాభా 115 , దేవులతండాలో 150 మంది ఓటర్లు, 50 కుటుంబాలు, రాజ్యతండాలో 100 ఓట్లు 35 కుటుంబాలు ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమ తండాల్లో పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



తండాలో కనీస సౌకర్యాలు కల్పించాలి. వర్షం వస్తే పూర్తిస్థాయిలో రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం. తండాలో ఉపాధి సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వం చొరవ చూపాలి. పనులు లేక హైదరాబాద్‌కు వలస పోతున్నాం.

–అంబోతు ప్రభాకర్, రాగ్యాతండా

ప్రత్యేక పథకాలు అందించాలి



గిరిజనులకు ప్రత్యేక పథకాలు అందజేయాలి. తండాల్లో సౌకర్యాలు కల్పించి, యువకులు వలస పోకుండా ఉపాధి చూపించాలి. అన్ని కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి. రేషన్ షాపు, పోలింగ్ స్టేషన్ మా తండాలోనే ఏర్పాటు చేయాలి.

–అంబోతు జగ్గులు, రాగ్యాతండా

ఇబ్బంది పడుతున్నాం



రేషన్ సరుకులకు, ఓటు వేయడానికి దూరభారంతో ఇబ్బంది పడుతున్నాం. రోడ్డుకు కంకర పోసి వదిలేయడంతో నడవలేకపోతున్నాం. వెంటనే రోడ్డు వేయించాలి. వృద్ధులకు తండాలోనే పెన్షన్ అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

–అంబోతు లక్ష్మి, రంగంతండా

రిజర్వేషన్లపై పార్లమెంట్‌లో చట్టం చేయాలి



నల్లగొండ టౌన్ : నిరసన తెలియజేస్తున్న నాయకులు



మునుగోడు : రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు

నల్లగొండ టౌన్ : బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలు చేయడం కోసం పార్లమెంట్‌లో చట్టం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని సుభాష్ విగ్రహం వద్ద బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో సగం జనాభా ఉన్న ప్రజల హక్కుల కోసం జరుగుతున్న పోరులో అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 18న జరిగే రాష్ట్ర బంద్‌లో బీసీలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పబ్బు వీరస్వామి, కెఎస్‌రెడ్డి, జిల్లా యాదయ్య, బరిగల వెంకటేష్, ఎండీ.యూసూఫ్, ఎం.నందం, సుజాత, విజయ, మాధవి, నారాయణ, దశరథ, రామకోటి, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు అమలుచేయాలని రాస్తారోకో

మునుగోడు: బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గుర్జ రామచంద్రం ఆధ్వర్యంలో బుధవారం సీపీఐ నాయకులు మునుగోడులో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రామచంద్రం మాట్లాడుతూ బీసీలకు తగిన వాట దక్కేవరకు సీపీఐ పోరాటం చేస్తుందన్నారు. బీసీ రిజర్వేషన్లు ఆమోదించాలని ఈ నెల 18న చేపట్టే బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బొల్గూరి నర్సింహ, తిరిపారి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి చాపల శ్రీను, కైలాస్ గౌడ్, మందుల పాండు, బండమీది యాదయ్య, మాదగోని సత్తమ్మ, రమేష్, వెంకన్న, అంజయ్య పాల్గొన్నారు.

అలరించిన భజన కార్యక్రమం

నకిరేకల్ : భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా నకిరేకల్‌లోని సత్యసాయి మందిరంలో సత్యసాయి జిల్లా యువజన విభాగం ఆధ్వర్యంలో బుధవారం భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సేవాసమితి జిల్లా అధ్యక్షుడు దేవరశెట్టి శ్రీనివాస్, సమితి కన్వీనర్ గర్రె శ్రీనివాస్, జిల్లా యూత్ కోఆర్డినేటర్ తోడుపునూరి శ్రీనివాస్, ప్రతినిధులు లక్ష్మణ్, శ్రీధర్, హనుమాన్, దేవరశెట్టి సత్యనారాయణ, పవన్ సంతోష్, బ్రహ్మయ్య, భాగ్యలక్ష్మీ, సంతోషి, గర్రె నాగమణి తదితరులు పాల్గొన్నారు.

‘హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి’

నల్లగొండ టౌన్: నల్లగొండలోని ఎస్సీ (ఎ) సంక్షేమ హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం నల్లగొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పేద మధ్య తరగతి దళిత విద్యార్థులకు కడుపు నిండా భోజనం పెట్టకుండా ఎస్సీ సంక్షేమ హాస్టల్లోకి వచ్చే బియ్యాన్ని, ఇతర సామగ్రిని వార్డెన్ బహిరంగ మార్కెట్లోకి అమ్మడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కలెక్టర్ ఈ ఘటనపై స్పందించి వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మారుపాక కిరణ్, నవదీప్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అధికారులు

మర్రిగూడ : ఉపాధ్యాయులు సమాజానికి దిక్సూచి లాంటివారని ఎంపీడీఓ జి.చినమునయ్య, స్పెషల్ ఆఫీసర్ బి.వేణుగోపాల్, ఎంఈఓ బిట్టు శ్రీనివాస్ అన్నారు. మర్రిగూడ మండల పరిధిలోని ప్రాథమిక, ఉన్నత, మోడల్ స్కూల్, కేజీబీవీ కి చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో వారు ఘనంగా సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఓ రవికుమార్, ప్రధానోపాధ్యాయులు మాలతి, శారదా, రూప్‌సింగ్, రామతులసి, వెంకటేశం, కేజీబీవీ ఎస్ఓ జ్యోతి, ఉదావత్ లచ్చిరాం, పాల్వాయి వెంకట్‌రెడ్డి, మాస బాలరాజు, నాగవరం శ్రీనివాస్, సబావత్ వెంకటకుమార్, రమణ, విఠల్, రమేష్, గ్యార వెంకటేష్, కృష్ణారెడ్డి, శ్రీశైలం, బాలాజీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పంట నష్టపరిహారం అందించాలి



తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కేతేపల్లి: ఇటీవల కురిసిన వర్షాలకు వరి, పత్తి పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.50వేల నష్టపరిహారం అందించాలని ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ కందాల ప్రమీల డిమాండ్ చేశారు. కేతేపల్లి మండలంలోని పలు గ్రామాల కొనుగోలు కేంద్రాల్లో వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని బుధవారం సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు, మండల కార్యదర్శి సీహెచ్.లూర్థుమారయ్య, కోట లింగయ్య ఎల్.రాజు, చెరుకు సత్తయ్య, చౌగోని నాగయ్య, కూకుట్ల శోభన్, వంగూరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రచార కరపత్రాల ఆవిష్కరణ

నకిరేకల్ : నల్లగొండ పట్టణంలోని శ్రామిక భవన్‌లో ఈ నెల 17, 18 తేదీల్లో జరగబోయే పీఓడబ్ల్యూ తెలంగాణ రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు బూరుగు లక్ష్మీ కోరారు. కార్యక్రమానికి సంబంధించిన ప్రచార కరపత్రాలను బుధవారం నకిరేకల్‌లోని మెయిన్ సెంటర్‌లో ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. మర్రి సంతోష్, పుష్ప, రాణి, ఎల్లమ్మ, సైదా, వెంకటమ్మ, స్వరూప, నాగమణి, యాదమ్మ అమ్ములు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధ్యక్షురాలు లక్ష్మి

పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

చిట్యాల: సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని చిట్యాల మండల బీజేపీ అధ్యక్షుడు పీక వెంకన్న బుధవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తమ పత్తిని దళారులకు అమ్ముకుని నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో మైళ్ల పరమేష్, వరికుప్పల నర్సింహ, గుంటోజు నాగాచారి పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నార్కట్‌పల్లి: దేశంలో ఆర్ఎస్ఎస్‌ను బ్యాన్ చేయాలని నార్కట్‌పల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జిల్లా పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నార్కట్‌పల్లిలో ఆర్ఎస్ఎస్ దిష్టిబొమ్మను దహనం చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంజనీర్ ఆనంద్ అజిని ఆర్ఎస్ఎస్ నాయకులు వేధించి ప్రాణాలు కోల్పోవడానికి కారణమయ్యారని ఆరోపించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుగుడు రవియాదవ్, యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ చింత మనోజ్‌కుమార్, బింగి మహేశ్‌యాదవ్, మాదాస్ విజయ్, బోడ సత్యనారాయణ, యుగంధర్, సతీష్, గణేష్, చింత సతీష్, మహేందర్, చెరుకు సాయి, గణేష్ పాల్గొన్నారు.

సదర్ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

శాలిగౌరారం: మండల కేంద్రంలో ఈ నెల చివరి వారంలో నిర్వహించబోయే సదర్ సమ్మేళన ఉత్సవాన్ని విజయవంతం చేయాలని యాదవ, కురుమ సంఘాల ప్రతినిధులు కోరారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం జరిగిన యదువ, కురుమ సంఘాల ప్రతినిధుల సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. నూక కిరణ్‌యాదవ్, నోముల జనార్దన్, జమ్ము రమేశ్, నోముల విజయ్‌కుమార్, తీర్పారి మల్లయ్య, బొల్లికొండ గణేశ్, మంగదుడ్ల శ్రీను, చింతల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను బలోపేతం చేయడమే లక్ష్యం

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్



చిత్తలూరు కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం: రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శాలిగౌరారం మండలంలోని చిత్తలూరు, తుడిమిడి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతుల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పాటుపడుతుందని అన్నారు. రైతులు తమ ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోవద్దన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర ×ఏ× గ్రేడ్ ధాన్యంకు రూ.2389, ×బి× గ్రేడు ధాన్యంకు రూ.2369 లభిస్తుందన్నారు. సన్నరకం ధాన్యంకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించిందని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ తాళ్ళూరి మురళి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నరిగె నర్సింహ, తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, డీపీఎం మోహన్‌రెడ్డి, ఏఓ సౌమ్యశృతి, ఏపీఎం శంకరయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు ఎర్ర చైతన్య పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత దూరం



కేతేపల్లి: భీమారంలో సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



తిప్పర్తి : పజ్జూరులో పోషణ మాసోత్సవంలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది

నల్లగొండ, నల్లగొండ టౌన్ : గర్భిణులు, బాలింతలతోపాటు ఐదేళ్లలోపు చిన్నారులకు పోషకాహారం అందించడం వల్ల రక్తహీనత దూరం చేయవచ్చని సీడీపీఓ తూముల నిర్మల అన్నారు. బుధవారం నల్లగొండలోని ఆర్యవైశ్య భవనంలో పానగల్, చర్లపల్లి, గొల్లగూడ సెక్టార్ల అంగన్‌వాడీ కేంద్రాల గర్భిణులకు, బాలింతలకు నిర్వహించి అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆరు సంవత్సరాలోపు చిన్నారులకు, కౌమార దశ బాలికలకు, గర్భిణులకు, బాలింతలకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో లక్ష్మమ్మ, పార్వతి, సరస్వతి, శ్రీలక్ష్మి, అనిత, సరిత, భాగ్యలక్ష్మి, రజిత, సునంద, సావిత్రమ్మ, ప్రకృతాంబ, రాజేశ్వరి, పద్మ, భారతి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

తిప్పర్తి : పౌష్టికాహారం తీసున్నట్లయితే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని సీడీపీఓ తూముల నిర్మల అన్నారు. పోషణ మాసంలో భాగంగా తిప్పర్తి మండల కేంద్రంలో బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మల్లీశ్వరి, ప్రధానోపాధ్యాయురాలు అరుణశ్రీ, అంగన్‌వాడీ టీచర్ జానమ్మ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పజ్జూరు సెక్టార్‌లో భాగంగా దుప్పలపల్లి ప్రాథమిక పాఠశాలలో పోషణ మాసం నిర్వహించారు. సామూహిక సీమంతాలు, వెల్‌బేబి షో నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రణీత, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ సతీష్, అంగన్‌వాడీ టీచర్‌లు వెంకటరమణ, సావిత్రి, అరుణ, ప్రమీల పాల్గొన్నారు.

చిరుధాన్యాలు, ఆకు కూరలు తినాలి

మునుగోడు: తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు లభించే చిరుధాన్యాలు, ఆకు కూరలను అధికంగా తినాలని సీడీపీఓ లావణ్య కుమారి విద్యార్థినులకు సూచించారు. పోషక మాసంలో భాగంగా బుధవారం మునుగోడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

కార్యక్రమంలో ఏసీడీపీఓ వెంకటమ్మ, సూపర్‌వైజర్ శివేష, నాగమణి, ఉపాధ్యాయులు అరుణ, శిరీష, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ సక్కుబాయి పాల్గొని మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహార లోపాన్ని, రక్తహీనతను అధిగమించడానికి ప్రతినిత్యం భోజనంలో పోషకాహారం తీసుకోవాలని సూచించారు. గర్భిణులు ఐరన్ ఫోలిక్ మాత్రలను ప్రతిరోజు తీసుకోవాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు యశోద, శ్రీలత, ఎంపీడీఓ చినమునయ్య, ఎంఈఓ బిట్టు శ్రీనివాస్, డీటీ నిర్మలాదేవి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శాలిని, హెల్త్ సూపర్‌వైజర్ అమృత, ఏఎన్ఎం అరుణ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కేతేపల్లి: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషకాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సీడీపీవో ఆశ్ర అంజూమ్ అన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా కేతేపల్లి మండలంలోని భీమారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పౌష్టికాహార అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. హెచ్ఎం కె.భిక్షమయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కళావతి, ఏఎన్ఎం హైమావతి, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి, అంగన్‌వాడీ టీచర్లు అరుణ, బేబి, కాంతమ్మ, సువార్త పాల్గొన్నారు.

కట్టంగూర్ : మండలంలోని దుగినవెల్లి ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం పోషణ అభియాన్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, హెచ్ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు మురళయ్య, కరుణాదేవి, శ్రీనివాసరావు, వెంకట్‌రెడ్డి, సలీం, వెంకటకృష్ణ, లీలావతి, సైదులు, జ్యోతి, ఉప్పలమ్మ, కళమ్మ, ఈదమ్మ పాల్గొన్నారు.

షాపుల అద్దెకు బహిరంగ టెండర్

సాక్షి ఎఫెక్ట్..

చిట్యాల: వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధులతో చిట్యాల పట్టణంలో 30 షాపులను నిర్మించిన అద్దెకు ఇవ్వకుండా అలాగే వదిలేశారు. దీంతో సాక్షి దినపత్రికల్లో×ప్రారంభించారు..వదిలేశారు× అనే శీర్షికతో గత నెల 28వ తేదీన కథనం ప్రచురితమైంది. స్పందించిన మార్కెటింగ్ శాఖ అధికారులు బుధవారం షాపులను అద్దెకు ఇచ్చేందుకు రిజర్వేషన్‌లను కేటాయించారు. ఇందులో ఎస్టీలకు 3, ఎస్సీలకు 5, పీహెచ్‌సీ 1, బీసీలకు 9, జనరల్ 12 మందికి రిజర్వేషన్‌ల మేరకు షాపులను అద్దెకు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఇందుకుగాను రూ.30 వేల ధరావత్‌తో కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చిట్యాల పేరున డీడీని తీసి సంబంధిత ధృవీకరణ పత్రాలతో ఈ నెల 22వ తేదీ లోపు టెండర్ షెడ్యూల్ పొందవచ్చని చిట్యాల మార్కెటింగ్ కార్యదర్శి జానయ్య తెలిపారు. ఈ నెల 25వ తేదీన ఓపెన్ టెండర్ ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 7330799599 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

నాంపల్లి: మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని మంగిరాణి జ్ఞాపకశక్తిలో ప్రతిభ కనబరుస్తోంది. సామాజిక కార్యకర్త గురిజ మహేష్ శిక్షణలో 28 సెకండ్లలో భారతదేశంలోని 29 రాష్ట్రాల రాజధానులు, ఆసియా ఖండంలోని 49 దేశాల రాజధానులను 48 సెకండ్లలో, ఆఫ్రికా ఖండంలోని 53 దేశాల రాజధానులను 53 సెకండ్లలో అనర్గళంగా చెబుతోంది. విద్యార్థినిని ప్రోత్సాహించడానికి బుధవారం దామెర మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థులు గాదగోని వెంకటేష్ గౌడ్, కర్నాటి గణేశ్ గౌడ్ రూ. 10 వేల విలువైన అభ్యసన పుస్తకాలు, అభ్యసన సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో మాడుగుల సైదులు, కోనేటి ఎల్లయ్య, చాపల నిరంజన్, చాపల వెంకటేష్, మంగి రవి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చందా రాజశేఖరం, ఉపాధ్యాయులు యాదయ్య, ఇమామ్, వెంకటరమణ, శ్రీహరి, మహేష్ ఉజ్వల, శ్రవణ్, శిరీష, రవి, సాజిదా బేగం పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

చండూరు : మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. బుధవారం చండూరులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో వరిచేలు కోసిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తడిసి రంగు మారిన వడ్లకు కూడా గిట్టుబాటు ధర ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం చండూరు మండల కార్యదర్శి ధనుంజయ, వెంకటేశం, లింగయ్య, గౌసియాబేగం, వెంకటయ్య, స్వామి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో ప్రతిభ

నకిరేకల్ : ప్రతిభ ఆదియోగి పరమేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్లగొండలో నిర్వహించిన నాలుగో రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో మహిళా విభాగంలో నకిరేకల్‌కు చెందిన సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. పాఠశాలకు చెందిన యోగా టీచర్ కొండ నిర్మలకు గోల్డ్ మెడల్ రాగా విద్యార్థుల విభాగంలో కొండ యశస్విని, ఏ.గాయిత్రి, పి.జెస్సికా గోల్డ్ మెడల్ సాధించారు. ఎం.రాకేష్, మనస్వి, సాయిచందర్, విశాల్, రక్షిత, హిమబిందు సిల్వర్ మోడల్స్, బి.గాయిత్రి, ఆర్.శివానందగౌడ్, పి.వైష్ణవిలు బ్రాంజ్ మెడల్ అందుకున్నారు. వీరికి ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.రవికిశోర్, ఆదియోగ ఫౌండేషన్ ప్రెసిడెంట్ పి.వినోద్ బహుమతులను అందజేశారని పాఠశాల ప్రిన్సిపాల్ లీనా ఆంటోని తెలిపారు.



బహుమతులు, సర్టిఫికెట్లతో విద్యార్థులు